క్లుప్తంగా

రత్నాల చెరువులో ఇళ్లలోకి చేరిన నీరు



మంగళగిరి: నగరంలో శనివారం వర్షం ముంచెత్తగా శివారు కాలనీలలో ఇళ్లల్లోకి నీరు చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగర కమిషనర్ అలీంబాషా ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలోని దీన్‌దయాల్ నగర్, చినకాకాని, రత్నాలచెరువు, టిడ్కో నివాసాలలో పర్యటించి ముంపు ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వర్షపు నీటిని బయటకు పంపాలి

తాడేపల్లిరూరల్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తాడేపల్లి మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయని, రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారని సీపీఎం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా అరటి, పసుపు, కంద, చేమ పంట పొలాల్లో వర్షపునీరు భారీగా చేరిందని, పొలాల్లో చేరిన వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడే నిలిచిపోయి పంటలు నీట మునిగి, పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని, పంటకు పెట్టుబడి పెట్టి, పంట చేతికి వస్తుందన్న సమయంలో వర్షాలు కురవడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు బయటకు పోయే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వర్షానికి రోడ్డుపై పడిన చెట్టు



మంగళగిరి: పట్టణంలోని నిడమర్రు రోడ్డులో శనివారం కురిసిన వర్షం, ఈదురు గాలులకు చెట్టు విరిగిపడింది. నిడమర్రు రోడ్డు రైల్వేగేటు దగ్గరలో పడిన చెట్టుతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

తెగిన నిడమర్రు చెరువు

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు చెరువు తెగడం స్థానికులను ఆందోళనకు గురిచేసింది. శనివారం కురిసిన భారీ వర్షానికి చెరువు తెగడంతో వర్షపు నీరు టిడ్కో నివాసాలతో పాటు ఎస్సీ కాలనీలోని ఇళ్లల్లోకి భారీగా చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లల్లోని నీటిని బయటకు పంపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చెరువు తెగి ఇళ్లల్లోకి నీరు చేరిందని స్థానికులు తెలిపారు.

భోజనం ప్యాకెట్లు అందజేత



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం తాడేపల్లి తహశీల్దార్ ఎఫ్ఏసీ సతీష్‌కుమార్ భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. తాడేపల్లి ప్రాంతంలో పలు నివాసాలు నీట మునగడం, కొన్ని ప్రాంతాల్లో వర్షపునీరు, మురుగు నీరు చేరడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఈ విషయాన్ని సతీష్ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్‌ఓలు, వీఆర్ఏల సహాయంతో పట్టణ పరిధిలోని డ్రైవర్స్ కాలనీ, తెల్ల క్వారీ, ఎర్ర క్వారీ, డోలాస్‌నగర్, గాంధీనగర్, ఎంఎల్ రామయ్య కాలనీ, పుష్కర కాలనీ, ఇస్లాం పేట, డోలాస్‌నగర్ 9వ వార్డు, ఆర్ఎంస్ కాలనీ, సీతానగరం, ప్యారీ కంపెనీ తదితర ప్రాంతాల్లో 400 మందికి భోజనం ప్యాకెట్లు అందజేసినట్లు వారు తెలిపారు.

పొంగిన వాగులు..



మేడికొండూరు: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని పలు లోతట్టు గ్రామాలు నీటమునిగాయి. కొర్రపాడు గ్రామంలో పక్కనే ఉన్న వాగు పొంగి పొర్లడంతో ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. పాలడుగు గ్రామంలో వాగు ఉధృతికి జగనన్న కాలనీలో నీరు చేరింది. ఏడుగురిని సత్తెనపల్లి అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. విశదల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచాయి. డోగిపర్రు గ్రామం అంబేడ్కర్ కాలనీలో ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. పత్తిపంట పొలాలు నీట మునిగాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

జలదిగ్బంధం



పెరికలపూడి-పెదపాలెం రోడ్డులో నీట మునిగిన పంట పొలాలు

- భారీ వర్షాలకు పొంగి పొర్లిన డ్రైనేజీలు
- నీట మునిగిన నివాసాలు, పంట పొలాలు
- నాలుగు చోట్ల కూలిన ఇళ్లు
- ఐదు ప్రాంతాల్లో జారిన కొండచరియలు
- ఆందోళనలో ప్రజలు
- లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలింపు



జలమయమైన తాడేపల్లి అండర్‌పాస్

తాడేపల్లిరూరల్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండలాల్లోని పలు గ్రామాలు నీటమునిగాయి. శుక్రవారం నుంచి శనివారం వరకు ఎడతెరిపి లేకుండా అతిభారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తాడేపల్లి పట్టణ, రూరల్‌లో రెండు రోజుల వ్యవధిలో 246.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, దుగ్గిరాల మండలంలో 254.2 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. గతంలో 15 ఏళ్లలో ఈ స్థాయిలో వర్షం తాము చూడలేదని పెద్దలు చెబుతున్నారు. ఏనాడూ వర్షపు నీరు, మురుగునీరు నివాసాల్లోకి రాని ప్రాంతమైన తాడేపల్లి పోతురాజు గుడి ప్రాంతంలో సుమారు 10 నివాసాల్లోకి వర్షపునీరు, మురుగునీరు వచ్చి చేరింది. చుట్టుపక్కల ఖాళీ రైల్వే స్థలాలు ఉండడంతో అక్కడి నుంచి విష సర్పాలు నీటితోపాటు వచ్చి చేరడంతో ఆ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మహానాడు కరకట్ట వెంబడి మణిపాల్ హాస్పిటల్ సమీపంలో మురుగునీరు, వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక కట్టవెంబడి వున్న నివాసాలు నీట మునిగాయి. కనకదుర్గ వారధి, రేపల్లె రహదారిలో కరకట్ట వెంబడి రెండువైపులా ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణనగర్, జగ్జీవన్‌రామ్ కాలనీ, ఎర్ర క్వారీ, తెల్లక్వారీతో పాటు నులకపేట చెరువువెనుక భాగంలో రోడ్లు జలమయమై ఇళ్లలోకి వర్షపునీరు చొరబడింది. తాడేపల్లిలోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై నుంచి వర్షపు నీరు భారీగా రావడంతో జాతీయ రహదారి వెంబడి వున్న అండర్‌పాస్‌లన్నీ జలమయమై రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా మారింది. ఉండవల్లి సెంటర్ నుంచి అమరావతి వెళ్లే రహదారిలో ఇప్పటివరకు ఏనాడూ ఈ రహదారిలో నీళ్లు కనిపించలేదు. తాజాగా కురిసిన వర్షానికి భారీగావర్షపు నీరు నిలిచింది. తాడేపల్లి రూరల్‌ప్రాంతంలోని వడ్డేశ్వరం, కొలనుకొండ, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, పెనుమాక, ఉండవల్లి తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి నివాసాల్లోకి వర్షపునీరు చొచ్చుకొచ్చాయి. ఇక పంటపొలాల సంగతి అయితే చెప్పనవసరం లేదు. తాడేపల్లి పట్టణ రూరల్‌లో వాణిజ్య పంటలను ఎక్కువగా పండిస్తారు. కంద పొలాలు సగానికి పైగా మునిగాయి. ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్న పసుపు, వరి పొలాలు, ఆకుకూర మడులు వర్షపు నీటిలో మునిగిపోయాయి.

విగిరిన కొండచరియలు...

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో సీతానగరం, పోలకంపాడు ప్రాంతాల్లో ఐదు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. తాడేపల్లి క్రిస్టియన్ పేట సచివాలయం ఎదురుగా కొండ చరియలు జారి ఒక ఇంటి ప్రహరీ ధ్వంసమైంది. సీతానగరం బోటు యార్డు దగ్గర నుంచి కృష్ణానదిపుష్కర ఘాట్‌లకు వెళ్లే మార్గంలో కొండచరియలు జారి స్వల్పంగా నివాసాలు దెబ్బతిన్నాయి. పోలకంపాడులో మరో మూడు చోట్ల కొండచరియలు జారి ఒక ఇంటి పైకప్పు పగలగా, మరో బిల్డింగ్ గోడ పూర్తిగా ధ్వంసమైంది. విస్తారంగా వర్షాలు కురవడంతో పరిస్థితులను పరిశీలించి సహాయక చర్యలు చేపట్టేందుకు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషాతో పాటు కార్పొరేషన్‌లోని వివిధ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖ వారు విస్తృతంగా పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.

దుగ్గిరాల మండలంలో...

దుగ్గిరాల మండలంలోని 18 గ్రామాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లో నివాసాలు జలమయమయ్యాయి. దుగ్గిరాల గ్రామంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారికి భోజనాలు అందిస్తున్నట్లు తహసీల్దార్ సునీత తెలిపారు. అదేవిధంగా ఈమనిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం వద్ద ఫాగింగ్ నిర్వహించామన్నారు. వరి పంటపొలాలు పూర్తిగా జలమయయ్యాయి. మరోరోజు వర్షం కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, ఈ సంవత్సరంలో ఇలా రెండవసారి జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



నులకపేట చెరువు వెనుక రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు



పోలకంపాడులో విరిగిపడిన కొండచరియలు



సియస్ ఆర్ రోడ్డులో నీట మునిగిన ఆకు కూర మడులు



ఇళ్లలోకి విషసర్పాలు రావడంతో వానలో బయటకు వచ్చిన పోతురాజు గుడి వాసులు

ముంచెత్తిన వర్షం



వృద్ధురాలిని కాలువ దాటిస్తున్న పోలీసులు



కాలువలో పూడిక తీస్తున్న పొక్లెయిన్

- శివారు కాలనీలు జలమయం. ఇళ్లల్లోకి చేరిన నీరు
- టోల్‌గేట్ వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం
- 170.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మంగళగిరి: ఎడతెరిపి లేని వర్షంతో నగరంలో జీనజీవనం అతలాకుతలం అయింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. నగర శివారు కాలనీలు వరదనీటిలో చిక్కుకున్నాయి. రోడ్లు, వీధులన్నీ చెరువులను తలపించాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు, చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజధాని ప్రాంతం మునిగిపోయింది. నీరుకొండ గ్రామంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీని నీరు చుట్టేసింది. కాజ టోల్‌గేట్ వద్ద నీరు చేరడంతో మునిగిపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలవడంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎన్ఆర్ఐ జంక్షన్ నుంచి గౌతమబుద్ధా రోడ్డు మీద వర్షం నీరు నిలిచింది. విలీన గ్రామాలలో పంటలు మునిగిపోయాయి. శివారు కాలనీలలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 170.6 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయన్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండంలోని నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, కురగల్లు అమృత యూనివర్సిటీలలో వరదనీరు చేరింది.



టోల్ గేట్ వద్ద వాహనాలను నియంత్రిస్తున్న పోలీసులు

నీట మునిగిన పంపుహౌస్

ఆగిపోయిన తాగునీటి సరఫరా



వర్షపు నీటిలో మునిగిన తాగునీటి సంపు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలో నులకపేటలో ఉన్న పంప్‌హౌస్ శనివారం కురిసిన వర్షానికి పూర్తిగా జలమయమైంది. ఎంటీఎంసీ పరిధిలోని కృష్ణనగర్ పాత పంచాయతీ కింద ఉన్న అన్ని ప్రాంతాలకు ఉదయం నుంచి తాగునీటి సరఫరాను నిలిపివేశారు. ప్రకాష్ నగర్ నుంచి పాత జాతీయ రహదారి వెంబడి గుంటూరు చానల్ వరకు వర్షపునీరు, మురుగునీరు ఈ పంప్‌హౌస్ మీద నుంచే వెళ్లాల్సి ఉంది. ఉన్నటువంటి అవుట్ ఫాల్ డ్రైన్ పది అడుగుల లోతు, నాలుగు అడుగుల వెడల్పు ఉన్నప్పటికీ డ్రైనేజీ పూర్తిగా నిండిపోయి వర్షపునీరు ఒక్కసారిగా పంప్‌హౌస్‌లోకి చొచ్చుకు వచ్చాయి. సిబ్బంది అప్రమత్తమై పంప్‌హౌస్‌లో వున్న మోటార్లను ఊడదీసి నీటిలో తడవకుండా జాగ్రత్త వహించారు. మరో మూడు రోజుల పాటు నులకపేట, బ్రహ్మానందపురం, జగ్జీవన్‌రామ్ కాలనీ, కృష్ణనగర్, ప్రకాష్‌నగర్, రాజీవ్ నగర్, తెల్ల క్వారీ, ఎర్ర క్వారీ, ఇస్లాంపేట ప్రాంతాలకు తాగునీటి సరఫరా కాకపోవచ్చు. పంప్ హౌస్ నిర్మాణం చేపట్టిన తరువాత మొట్టమొదటి సారిగా పంప్‌హౌస్‌లోకి వర్షపు నీరు వచ్చి చేరినట్లు సిబ్బంది తెలియజేశారు.

జనజీవనం అస్తవ్యస్తం

- ఉప్పొంగిన వాగులు వంకలు, నిలిచిపోయిన రాకపోకలు
- రాజధాని ప్రాంతానికి రాకపోకలు లేక ఉద్యోగులు, ప్రజల అవస్థలు
- కొండవీటి వాగులో ముగ్గురు యువకులు, గ్యాస్ సిలిండర్ల ఆటో గల్లంతు, కాపాడిన స్థానికులు



తాడికొండ- గుంటూరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు



పెదపరిమి- నెక్కల్లు మధ్య భారీగా ప్రవహిస్తున్న వాగు



తాడికొండ ఎస్సీ కాలనీలో ..

తాడికొండ: శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్ష బీభత్సం కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. గత 15 సంవత్సరాలలో ఎన్నడూ లేని భారీ వర్షం కురవడంతో రాజధాని ప్రాంతానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, సామాన్యులు నానా ఇబ్బందులు పడ్డారు. కొండవీటి వాగుకు వరద ఉధృతి పోటెత్తడంతో తాడికొండ మండలం లాం గ్రామం వద్ద అమరావతి - గుంటూరు ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డు దాటేందుకు యత్నించిన సిలిండర్ల వ్యాను బోల్తా పడటంతో సిలిండర్లు నీటిలో కొట్టుకుపోగా స్థానికులు సహకారం అందించి కొన్నింటిని ఒడ్డుకు చేర్చారు. సాయంత్రం సమయంలో ముగ్గురు యువకులు నడిచి వస్తూ నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. స్థానికులు, పోలీసులు తాళ్ల సాయంతో ఇద్దరిని బయటకు లాగగా, చెట్లను పట్టుకొని వేలాడుతున్న మరో యువకుడుని రాత్రి 8 గంటల సమయంలో రెస్క్యూ టీమ్ బయటకు తీసుకొచ్చింది. కంతేరు వద్ద ఎర్రవాగు, పెదపరిమి వద్ద కోటేళ్ల వాగు ఉప్పొంగడంతో రాజధానికి వెళ్ళేందుకు రహదారులు పూర్తిగా మునిగిపోయాయి. రాజధానిని ప్రపంచ స్థాయిలో నిర్మిస్తానని చెబుతున్న చంద్రబాబు కనీసం రోడ్లు, రవాణా వ్యవస్థను ప్రక్షాళన చేయకపోవడం కారణంగా ప్రతి ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా లాం వాగు, పెదపరిమి కోటేళ్ల వాగు, కంతేరు ఎర్రవాగు, నీరుకొండ - పెదపరిమి వద్ద వాగులపై వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. కొండవీటి వాగు వరద ఉధృతి మళ్లింపునకు నామమాత్రపు చర్యలు తప్ప పూర్తిస్థాయి ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకోపోవడం కారణంగా ఏటా ఈ దుస్థితి తప్పడం లేదు. హైకోర్టుకు వెళ్లే ప్రధాన రహదారిపై నీరు ఏరులై పారడంతో వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. తుళ్ళూరు శివారు పేరమ్మ వాగు, అయ్యన్న వాగు ఆక్రమణలకు గురై కుచించుకుపోవడంతో వరద నీరు బయటకు వెళ్లే దారిలేక తూర్పు వీధిలో ఇళ్లలోకి చేరింది. ఇక తాడికొండలో డ్రెయిన్‌లను పూడ్చివేసి రియల్ ఎస్టేట్ వెంచర్ల నిర్వాహకులు తూములు వేయడంతో ప్రధాన వరద నీరు వెళ్లే దారిలేక ప్రధాన రహదారిపైనే పొంగిపారింది. వాహనాదారులు వెళ్ళే దారిలేక నానా అవస్థలు పడ్డారు. కంతేరు రైల్వే గేట్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌యూబీ నిండుగా నీరు చేరడంతో జాతీయ రహదారికి రాకపోకలు నిలిచిపోయాయి.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలి

అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మానస



తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అంటువ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంటీఎంసీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ (డ్రైవర్స్ కాలనీ) అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు మానస అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా కలుషితమైన నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వలన డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, బయట ఆహారానికి దూరంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల్లో డెలివరీ అయ్యే గర్భిణులు, హై రిస్క్ గర్భిణులు ముందస్తుగా హాస్పిటల్ చేరాలన్నారు.

ముంపు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల పర్యటన



వర్షపు నీరు ఇంట్లోకి చేరిన వారిని పరామర్శిస్తున్న ముదిగొండ ప్రకాష్

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ముంపు ప్రాంతాలను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. పార్టీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ పట్టణ ప్రాంతంలోని లంబాడీ కాలనీ, పోతురాజు గుడి, నులకపేట ప్రాంతాల్లో పర్యటించారు. సీతానగరంలో ఎస్టీ సెల్ నాయకుడు బాలసాని అనిల్, బీసీ సెల్ నాయకుడు బత్తుల దాసు విస్తృతంగా పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వర్షపాతానికి ప్రజలందరు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఎన్నడూ లేని విధంగా లోతట్టు ప్రాంతాల్లోని నివాసాల్లోకి వర్షపునీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వారికి అవసరమైన నిత్యావసరాలు అందజేయాలని, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానంద రెడ్డి, ఇప్పటం సొసైటీ మాజీ అధ్యక్షుడు మేకల సాంబశివరావు పలువురిని పరామర్శించి, నీట మునిగిన పంటపొలాలను పరిశీలించి ప్రభుత్వం అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రతి ఒక్కరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

టీడీపీ నాయకుల పర్యటన...

తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ముంపునకు గురైన పలు ప్రాంతాలను తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు స్థానిక నాయకులతో కలసి విస్తృతంగా పర్యటించారు.

బస్సులను ఇతర అవసరాలకు వినియోగిస్తే చర్యలు



పాఠశాలల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్టీవో ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు

తెనాలి రూరల్: విద్యా సంస్థల బస్సుల్ని ఇతర అవసరాలకు వినియోగిస్తే పర్మిట్లు రద్దు చేస్తామని తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి కె. ప్రసాద్ స్పష్టం చేశారు. తెనాలి ఆర్టీవో పరిధిలోని విద్యా సంస్థల యాజమాన్యాలతో శనివారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బస్సులను పెళ్లిళ్ల ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని, ఇకపై అటువంటి వాటిని గుర్తిస్తే వెంటనే పర్మిట్‌ను రద్దు చేస్తామని తెలిపారు. బస్సులు కచ్చితంగా 32 నిబంధనలు పాటిస్తూ ఫిట్‌నెస్ కలిగి ఉండాలని వెల్లడించారు. పాఠశాల బస్సు డ్రైవర్ 60 సంవత్సరాల వయో పరిమితి దాటిన వ్యక్తి అయితే అనర్హుడని పేర్కొన్నారు. డ్రైవర్ ప్రతి మూడు నెలలకొకసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆ రికార్డులు భద్రపరచాలని వివరించారు. డ్రైవర్ల నియామకాన్ని ఆర్టీవో అధికారులకు తెలియజేయడంతో పాటు, ఐదేళ్ల అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరచుకునే బాక్స్‌లు తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు. విద్యార్థులను తరలించే ఆటోల్లో ఆరుగురు మాత్రమే ఉండాలని తెలిపారు. సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షం.. నిలిచిన రాకపోకలు



వేమవరంలో బ్రిడ్జిపైకి వచ్చిన నీరు

ఫిరంగిపురం: ఎడతెరపి లేకుండా వర్షంతో వాగులు, వంకలు పొంగుతున్నాయి. రోడ్లు జలమయం అయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. పంటపొలాలు నీటిమయమయ్యాయి. ఇప్పటికే పంటలు వేసుకున్న జొన్న, పత్తి పొలాల్లో నీరునిలిచిపోయింది. వేమ వరం అడ్డరోడ్డు సమీపంలో వాగు పొంగి పొర్లుతోంది. ఫిరంగిపురంలోని ఆరోగ్యనగర్ వెళ్లే దారిలో రైల్వే అండర్ టన్నెల్‌కు నీరుచేరి కాలనీకి వెళ్లే వీలులేకుండా పోయింది. వేమవరం అడ్డరోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు దారిలో ఉన్న రైల్వే అండర్ టన్నెల్‌లోకి ఆరు అడుగుల లోతు నీరు రావడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాలిబాటన రైల్వే పట్టాలు మీదుగా అవతలికి దాటుతున్నారు. అదే విధంగా నుదురుపాడు నుంచి కండ్రిక గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న రైల్వే అండర్ టన్నెల్‌కు నీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

రోడ్లపై నిలిచిన నీరు..

ఫిరంగిపురం నుండి 113 తాళ్లూరు వెళ్లేదారిలో మూడు ప్రాంతాల్లో పొలాల్లోని నీరు రోడ్డుపైకి చేరింది. దీంతో వాహనాలు వెళ్లేందుకు కూడా వీలు లేని పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద వాగునీరు రోడ్డు నాలుగు అడుగుల మేరి వచ్చి చేరింది. 113 తాళ్లూరు నుంచి వేమవరం వచ్చే దారిలో ఎస్సీ కాలనీ వద్ద ఉన్న రెండు బ్రిడ్జిలపై నీరు వచ్చి చేరింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. నుదురుపాడు ఊరి చివరి నుంచి పక్కనే ఉన్న 50 కుటుంబాల వారు దారిలో ఉన్న లోలెవల్ చప్టాపై నీరు పారుతుండటంతో రాకపోకలు లేక ఇబ్బందులు పడుతున్నారు. బేతపూడి నుంచి మునగపాడు వచ్చేదారిలోను, మరియు బేతపూడి నుంచి గుండాల పాడు వచ్చేదారిలోని లోలెవల్ బ్రిడ్జిలపై కాలువ నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు లేనిసమయంలో బ్రిడ్జిలకు మరమ్మతులు నిర్వహించడంలేదని, దీనిపై సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయాగ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.